# మేడారం హుండీల లెక్కింపు షురూ

**తొలి రోజు 134 హుండీల లెక్కింపు**

**రూ.3.15 కోట్ల ఆదాయం**

**అంబేద్కర్ ఫొటోతో ఆరు రూ.100 నోట్లు లభ్యం**

వరంగల్, ఫిబ్రవరి 29 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర హుండీల లెక్కింపు మొదలైంది. గురువారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జాతరలో ఏర్పాటు చేసిన 518 హుండీల్లో తొలి రోజు 134 హుండీల్లోని ఆదాయం లెక్కించారు. రూ. 3 కోట్ల 15 లక్షల 40 వేల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు హెచ్‌డీఎఫ్‌సీ, యూనియన్, కెనరా బ్యాంకుల్లో జమ చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ములుగు ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, మేడారం జాతర ఈవో రాజేంద్రం, జాతర పూజారుల పర్యవేక్షణలో హుండీల లెక్కింపు ప్రక్రియ సాగింది. దేవాదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుమారు 350 మంది లెక్కింపులో పాల్గొన్నారు. హుండీల లెక్కింపు ప్రక్రియ మరో నాలుగు రోజులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**అంబేద్కర్ ఫొటోతో ఆరు నోట్లు లభ్యం..**

మేడారం జాతర హుండీల్లో ఆరు నోట్లు కలకలం సృష్టించాయి. అంబేద్కర్ ఫొటోతో ముద్రించిన ఆరు రూ.100 నోట్లను సిబ్బంది గుర్తించారు. గాంధీ ఫొటో ఉండాల్సిన స్థానంలో అంబేద్కర్ ఫొటో ముద్రించిన వంద రూపాయల నోట్లను భక్తులు హుండీల్లో వేశారు. ఈ నోట్లపై అంబేద్కర్ ఫొటోతో వంద రూపాయల నోట్లను ముద్రించాలని రిజర్వ్ బ్యాంక్‌ను డిమాండ్ చేస్తూ నోట్ రాయడం చర్చనీయాంశంగా మారింది.



మేడారం జాతర హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది



అన్నారం బరాజ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాల్క సుమన్, పుట్ట మధుకర్ తదితరులు

*బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం కాళేశ్వర యాత్ర చేపట్టనుంది. కేటీఆర్‌తోపాటు పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు ప్రాజెక్టును సందర్శించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ మరమ్మతుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టును పరిశీలించనున్నారు. హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయనున్నారు. అన్నారం వద్ద ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు పర్యవేక్షించారు.*

*– జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ)*

# నేడు బీఆర్ఎస్ కాళేశ్వర యాత్ర

**బరాజ్‌లను పరిశీలించనున్న నేతల బృందం**

**కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు**

**అన్నారంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్**

**ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు**

**భూపాలపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో హాల్టింగ్**



భూపాలపల్లిలో హాల్టింగ్ కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న గండ్ర

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను బట్టబయలు చేసి ప్రజలకు తెలియజేసేందుకు శుక్రవారం బీఆర్ఎస్ కాళేశ్వర యాత్ర చేపట్టింది. మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్లు కుంగిన సాకుతో అసలు ప్రాజెక్టే పనికి రాదనే కుట్రలకు తెరలేపి ప్రాజెక్టును నీటిపాలు చేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్‌కు దీటైన కౌంటర్ ఇవ్వడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు, భారీ నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు సుమారు 500 మంది నేడు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ తెలంగాణ భవన్ నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 1 గంటకు భూపాలపల్లికి చేరుకుంటారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కాసేపు ఆగి భోజనాలు చేసి అక్కడి నుంచి మేడిగడ్డ బరాజ్‌కు చేరుకుని కుంగిన పిల్లర్లను పరిశీలిస్తారు. మిగిలిన వాటి పరిస్థితిని అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకుని పరిశీలిస్తారు. చివరికి అన్నారానికి చేరుకుని సీపేజ్‌లు, బరాజ్‌ను పరిశీలిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన వేదికలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు గురించి ఎమ్మెల్యే కేటీఆర్ ప్రసంగిస్తారు. బరాజ్ రైతులకు మేలు చేస్తుందా.. నష్టం చేస్తుందా అనే విషయమై ముఖ్య నేతలు క్షుణ్ణంగా వివరిస్తారు. అలాగే హరీశ్‌రావు ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారు. ఇందుకు సంబంధించి అన్నారం వద్ద వేదిక ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు గురువారం పర్యవేక్షించారు. కాగా భూపాలపల్లిలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ బృందం సుమారు వెయ్యి మందికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. గురువారం బీఆర్ఎస్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఏర్పాట్లను పరిశీలించారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలందరికి భోజనం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నారం నుంచి తిరుగు ప్రయాణంలో పరకాలలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రాత్రి డిన్నర్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

## కాళేశ్వరం నీటిని ఎత్తిపోయాలి

**పంటలకు సాగునీరందించాలి**

**కలెక్టరేట్ ఏవోకు రైతుల వినతి**

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 29: కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్ద కుంగిన పిల్లర్లను అధికార కాంగ్రెస్ పార్టీ తప్పుగా చూపించి కాలయాపన చేయకుండా వెంటనే నీళ్లు లిఫ్ట్ చేసి పంటలకు సాగు నీరందించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవో మహేశ్‌బాబుకు గురువారం భూపాలపల్లి మండలంలోని రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దశాబ్దాలుగా కరువు పీడితులమై దుఃఖించిన మా ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక కల్పతరువుగా మారిందన్నారు. బీడు భూములన్నీ కొంతకాలంగా కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు. కానీ ఇటీవల దురదృష్టవశాత్తు మేడిగడ్డ బరాజ్‌లోని మూడు పిల్లర్లకు పగుళ్లు రావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ దానిని తప్పుగా చూపిస్తూ కాలయాపన చేస్తున్నందున పంటలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. వెంటనే పిల్లర్లకు మరమ్మతులు చేపట్టి కాళేశ్వరం నీళ్లు లిఫ్ట్ చేసి పంటలకు అందించాలని వారు కోరారు.



కలెక్టర్ కార్యాలయం ఏవో మహేశ్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు



సారలమ్మ దేవత అడెరాలకు పూజలు చేస్తున్న సారయ్య దంపతులు

# తిరుగువారం మొక్కులు

**సారలమ్మకు కాక వంశీయుల ప్రత్యేక పూజలు**

**మహా జాతర పరిసమాప్తం.. మళ్లీ ఉగాదికి గుడిని తెరువనున్న పూజారులు**

తాడ్వాయి, ఫిబ్రవరి 29 : తాడ్వాయి మండలం కన్నెపల్లిలోని సారలమ్మ దేవత పూజా మందిరంలో కాక వంశీయులు గురువారం తిరుగువారం పూజలు నిర్వహించారు. గత శనివారం గద్దెలను విడిచి గుడికి చేరుకున్న అమ్మవారి గుడిని నీటితో శుభ్రం చేసి, అడెరాలను శుద్ధి చేశారు. అనంతరం పూజారులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన పూజారి కాక సారయ్య అడెరాలపైనున్న గంటలను కొడుతూ తల్లిని స్మరిస్తూ గంటపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తల్లికి యాటపోతును సమర్పించి, యాట ప్రసాదాన్ని కుల పెద్దలకు పంచిపెట్టారు. తిరుగువారం మొక్కుల సందర్భంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన భక్తులు సారలమ్మ గుడిలో పూజలు చేశారు. దీంతో మహాజాతర సమాప్తమవుతుందని, గుడికి తాళాలు వేసి మూసివేస్తామని ప్రధాన పూజారి కాక సారయ్య తెలిపారు. తిరిగి వచ్చే ఉగాది పండుగ రోజున తాళాలు తీసి దేవతకు ప్రత్యేక పూజలు చేసి, యాటలను సమర్పిస్తామని చెప్పారు. మళ్లీ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మండెమెలిగే పండుగ(మినీ జాతర)కు గుడి తాళాలు తీసి పూజలు చేస్తామన్నారు.

# వనాన్ని తెచ్చి.. నైవేద్యంగా పెట్టి..

**పూనుగొండ్లలో రెండో రోజు ఘనంగా తిరుగువారం**

**నేడు భక్తుల మొక్కులతో జాతర పూర్తి**

గంగారం, ఫిబ్రవరి 29 : మేడారం మహాజాతర పరిసమాప్తమైంది. సమక్క- సారలమ్మ తల్లులు గద్దెల నుంచి తిరిగి వనం చేరుకున్నారు. జాతర సందర్భంగా మేడారంలోని గద్దెలపై భక్తుల మొక్కులందుకున్న సమ్మక్క భర్త పగిడిద్దరాజు తిరిగి తన స్వస్థలమైన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు చేరుకోగా, తిరుగువారం పండుగను పెనక వంశీయులు ఘనంగా నిర్వహించారు. గురువారం రెండో తిరుగువారం (నాగవెల్లి)జాతరను కన్నుల పండువగా జరిపారు. ఆలయ పూజారులు, గ్రామస్తులు ఉదయం గ్రామ సమీపంలోని దేవుడి గుట్టకు చేరుకుని రహస్య పూజలు చేశారు. అక్కడి నుంచి కంకవనాన్ని తీసుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో గ్రామ పొలిమేరకు చేరుకోగానే గ్రామస్తులు, భక్తులు నీళ్లారబోసి స్వాగతం పలికారు. సంతానం కోసం కొందరు మహిళలు వరం పట్టగా, వారిపై నుంచి వనాన్ని తీసుకెళ్లి పడిగిద్దరాజు ఆలయంలో గద్దెలపై ప్రతిష్ఠించారు. తిరిగి సాయంత్రం పగిడిద్దరాజు పడిగ రూపాన్ని గ్రామంలోని ప్రతి ఇంటికీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం గంగా స్నానం చేసి రాత్రి గుడికి చేరుకున్నారు. గిరిజన సంప్రదాయ ప్రకారం అర్ధరాత్రి గుడిమెలిగే పండుగ చేశారు. తెల్లవారుజామున హరణి పెట్టడంతో (దేవుడికి ఇష్టమైన నైవేద్యం) రెండో రోజు జాతర ముగుస్తుంది. శుక్రవారం భక్తుల మొక్కులతో జాతర పూర్తవుతుందని పూజారులు పెనక సురేందర్, రాజేశ్వర్, పురుషోత్తం తెలిపారు.



గద్దెలపై వనాన్ని ప్రతిష్ఠిస్తున్న పూజారులు

## చలో మేడిగడ్డను జయప్రదం చేద్దాం

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

హనుమకొండ, ఫిబ్రవరి 29: నేటి చలో మేడిగడ్డ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు శుక్రవారం చలో మేడిగడ్డకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో శ్రీహరి నివాసంలో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ చలో మేడిగడ్డ కార్యక్రమం జనగామ, ఘన్‌పూర్, వరంగల్ బైపాస్, గూడెప్పాడ్, పరకాల, భూపాలపల్లి మీదుగా కొనసాగుతుందన్నారు. దారిపొడవునా భద్రత ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం పోలీస్ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిందన్నారు. తెలిసీ తెలియక మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా సజీవంగా చూపెడతామని పేర్కొన్నారు. 'కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే కాదు.. మూడు బరాజ్‌ల సమాహారం అని, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల ప్రవాహ కాలువలు, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 240 టీఎంసీల వినియోగం.. వీటన్నింటి సమగ్ర స్వరూపమే ప్రాజెక్టు' అని తెలిపారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జడ్పీ చైర్మన్లు సుధీర్ కుమార్, గండ్ర జ్యోతి, నాగుర్ల వెంకన్న, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నాయకుడు భరత్‌కుమార్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

# కేడీసీలో నేటి నుంచి జాతీయ సదస్సు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 29 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కాలేజీ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారి ఆర్థిక సౌజన్యంతో కాలేజీలో 'ఫింటెక్ ది ఇంక్లూజివ్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ' అనే అంశంపై జాతీయ సదస్సును ముఖ్యఅతిథి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథి కేయూ వీసీ తాటికొండ రమేశ్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 100కు పైగా అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడానికి విద్యా సంస్థలు పరిశోధక సంస్థలు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.

# పోలీసుల తీరుపై మండల సభ ఆగ్రహం

**ప్రజాప్రతినిధులను చిత్రహింసలు పెట్టడంపై నిరసన**

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్**

**సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు**





పోలీసుల తీరుపై మండల పరిషత్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

దామెర, ఫిబ్రవరి 29: ప్రజాప్రతినిధులను పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలు పెట్టడంపై దామెర మండల సభ ఆగ్రహం వ్యక్తం చేసింది. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షతన జరుగగా, జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలు నిరసనగా నల్ల కండువాలు ధరించి హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గంపేట, దామెర ఎంపీటీసీలు గండు రామకృష్ణ, పోలం కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకునేందుకు వెళ్లిన వైస్ ఎంపీపీ జాకీర్‌అలీతోపాటు మరికొందరు ప్రజాప్రతినిధులపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. థర్డ్ డిగ్రీ ఉపయోంచి విచక్షణారహితంగా కొడుతూ చిత్రహింసలు పెట్టారన్నారు. జాతరలో జై తెలంగాణ. జై చల్లా అంటూ నినాదం చేయడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా పోలీసులు తనను చిత్రహింసలకు గురి చేశారని వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీ గరిగె కల్పన మాట్లాడుతూ పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులపై పోలీసుల చర్యలను మండల సర్వసభ్య సమావేశం తీవ్రంగా ఖండిస్తున్నదని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన పోలీసుల తీరుపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అనంతరం సమావేశాన్ని వారు బహిష్కరించారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఎంపీవో రంగాచారి, ఏఈలు గుర్రం రమేశ్, సతీశ్, ఎంఈవో రమాదేవి, ఏపీఎం ఝాన్సీ, వెటర్నరీ డాక్టర్ దీపిక, ఏఈవో అశోక్‌బాబు, ఏపీవో శారద, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విష్ణుమూర్తి, సతీశ్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్

**చర్చనీయాంశంగా జిల్లా అధికారి నియామకం**

**జిల్లా మైనార్టీ అధికారిగా ఏసీడీపీవో**

**విమర్శలకు తావిస్తున్న పోస్టింగ్**

**పైరవీలకే ప్రాధాన్యత**



ప్రేమలతను సన్మానిస్తున్న మైనార్టీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది

ములుగు, ఫిబ్రవరి29 (నమస్తేతెలంగాణ): ములుగు జిల్లాలో కింది స్థాయి ఉద్యోగికి జిల్లా అధికారి పోస్టింగ్ ఇవ్వడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఏటూరునాగారం ఏసీడీపీవోగా విధులు నిర్వర్తించిన ప్రేమలతను అప్పటి కలెక్టర్ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్(డీడబ్ల్యూవో)గా నియమించారు. కాగా, ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారుల బదిలీలు జరుగుతున్న దృష్ట్యా ఇటీవల ఆమెను డీడబ్ల్యూవో పోస్టు నుంచి రిలీవ్ చేసి తిరిగి ఏటూరునాగారం ఏసీడీపీఓగా బదిలీ చేశారు. ఇదంతా బాగానే ఉన్నా పోస్టింగ్ వచ్చిన దగ్గర విధుల్లో చేరని ప్రేమలత ప్రస్తుతం ఏకంగా జిల్లా మైనార్టీ అధికారిణిగా పోస్టింగ్ తెచ్చుకోవడంపై ఉద్యోగులు విమర్శిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారిగా నియమించాలంటే ఎఫ్‌ఏసీ విధానం ప్రకారం సీనియర్ అధికారులను నియమించాల్సి ఉంటుందని, ఇలా ఏసీడీపీవో స్థాయి అధికారిని జిల్లా మైనార్టీ అధికారిగా ఎలా నియమిస్తారని ముక్కున వేలేసుకుంటున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పనిచే స్తున్న సదరు ఉద్యోగిని మైనార్టీ శాఖ జిల్లా అధికారి ఎలా అవుతుందని చర్చించుకుంటున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జరగాల్సిన బదిలీలు, నియామకాలు అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. సంక్షేమ శాఖలో ప్రేమలత కంటే సీనియర్లు ఉన్నప్పటికీ అర్హులైన అధికారులే లేనట్లు ఆమెకే జిల్లా స్థాయి అధికారి పోస్టింగ్ రావడంపై పైరవీలకే ప్రాధాన్యత లభించినట్లయిందని ఉద్యోగులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

**పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**ములుగులో ఘనంగా సేవాలాల్ జయంతి**



సేవాలాల్ చిత్రపటాన్ని మంత్రికి అందజేస్తున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు

ములుగురూరల్, ఫిబ్రవరి29: సమాజంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని వాటిని అధిగమిస్తూ 18వ శతాబ్దంలోనే సంఘ సంస్కర్తగా పనిచేసిన సేవాలాల్ మహారాజ్ సూచించిన మార్గాన్ని అనుసరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సేవాలాల్ జయంతి ముగింపు వేడుకలను గురువారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్‌ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చునన్నారు. 'అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండు.. 'అహింసా మార్గాన్ని అవలంబిస్తూ మహిళలను గౌరవించు' అన్న సేవాలాల్ బోధనలు పాటించాలని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ మాట్లాడుతూ బంజారా జాతి అభివృద్ధికి సేవాలాల్ మహారాజ్ కృషి చేశారని అన్నారు. ఆయన చెప్పిన విధంగా సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధి చెందిన వారు జాతిలో ఇతరుల ఉన్నతికి పాటు పడాలని అన్నారు. సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధిస్తూ గిరిజన జాతి అభ్యున్నతికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, డీఎస్పీ రవీందర్, బంజారా నాయకులు పాల్గొన్నారు.